- మందుపాతరలకు బలవుతున్న అమాయక జనం
- 3న కొంగాలలో ఏసు మృతి, తాజాగా కాలిని కోల్పోయిన సునీత
- వరుసగా పేలుతున్న ప్రెషర్‌బాంబులు
- ములుగు-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చెదిరిన ప్రశాంతత
- బిక్కుబిక్కుమంటున్న అటవీ ప్రాంత ప్రజలు


వాజేడు అడవుల్లో పోలీసులు నిర్వీర్యం చేసిన మందుపాతరలు

# ఏజెన్సీలో బాంబు భయం

**ములుగు ఏజెన్సీని బాంబు భయపెడుతోంది. పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు వరుసగా పేలుతూ అమాయక జనాన్ని బలి తీసుకుంటున్నాయి. ఈ నెల 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో ఇల్లందుల యేసు మృత్యువాతపడగా, తాజాగా దైవదర్శనం కోసం ఈ నెల 13 గ్రామస్తులతో వెళ్తూ ప్రెషర్ బాంబుపై అడుగేసిన దర్ర సునీత తీవ్రంగా గాయపడి కాలిని కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పటికే పోలీసులు పలుచోట్ల మందుపాతరలను నిర్వీర్యం చేసినప్పటికీ ఇలా ఎక్కడ మందు పాతర ఉందో, ఏ ప్రదేశంలో కాలు మోపితే ఏం జరుగుతుందో తెలియక అటవీ ప్రాంత జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతోంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీస్-మావోయిస్టుల కారణంగా ప్రశాంతత చెదిరి, ఏ క్షణంలో ఏ విధ్వంసం జరుగుతుందోనని భయంతో వణికిపోతున్నారు.**

**- ములుగు, జూన్ 14(నమస్తే తెలంగాణ)**


కాలును కోల్పోయి చికిత్స పొందుతున్న సునీత

ములుగు జిల్లాలో మందుపాతరలకు అమాయకులు బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో అడవుల్లో పోలీసు బలగాలను మోహరిస్తుండగా, ప్రెషర్‌బాంబులు, మందుపాతర్లు అమరుస్తుండడంతో ఏజెన్సీ ప్రజలు వణికిపోతున్నారు. ఈ నెల 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు యేసు అనే వ్యక్తి మృతి చెందాడు. ఇది మరువకముందే ఈ నెల 13న చొక్కాలకు చెందిన డర్ర సునీత గ్రామస్తులతో కలిసి అటవీ ప్రాంతంలోని దేవుడిని దర్శించుకునేందుకు వెళ్తూ ప్రెషర్ బాంబుపై కాలు వేయడంతో అది పేలి తీవ్ర గాయాలపాలైంది. భద్రాచలం దవాఖాన వైద్యులు శుక్రవారం సునీత ఎడమ కాలును తొలగించడంతో అవిటిరాలిగా మిగిలింది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ సంఖ్యలో మందుపాతరలు, ప్రెషర్ బాంబులను గుర్తించడంతో ఏజెన్సీలో కలకలం చెలరేగుతున్నది. ప్రస్తుతం మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కంచుకోటగా ఉన్నప్పటికీ గడిచిన ఆరు నెలల్లో 11 ఎన్‌కౌంటర్లు జరిగి 119 మంది మావోయిస్టులు చనిపోయారు.


మృతి చెందిన యేసు (ఫైల్)

***సరిహద్దుల్లే లక్ష్యంగా..***

ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతో పాటు కొత్తగూడెం జిల్లాలోని చర్ల అడవులు ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దులుగా ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రోడ్డు మార్గాన్ని మినహాయిస్తే పోలీసులు మావోయిస్టుల స్థావరాలను చేరాలంటే దట్టమైన అడవుల గుండా వెళ్లాల్సిందే. అయితే పోలీసులు టార్గెట్‌గా ఆయా మార్గాల్లో మావోయిస్టులు మందు పాతరలు, ప్రెషర్ బాంబులు, బూబీట్రాప్‌లను అమర్చారు. వీటిపై అడుగుపడితే భారీ విస్పోటనం చెందుతాయి. పోలీసు బలగాల వెంట బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలు ఉన్నా కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

***గతంలోనూ సంఘటనలు***

2003లో వాజేడు మండలం కొప్పుసూరు గ్రామ సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జి వద్ద అమర్చిన మందు పాతర కారణంగా చిట్టెం అచ్చాలు మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. 2018లో కొంగాల అటవీ ప్రాంతంలో పాడి ఆవు మృతి చెందింది. 2019లో వెంకటాపురం(నూగూరు) మండలం ముకునూరుపాలెం అటవీ ప్రాంతంలో జరిగిన పేలుడు కారణంగా దివ్యాంగుడైన సోయం పెంటయ్య మృతిచెందాడు. అలాగే ఈ నెల 5న వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెలిమెల గ్రామ సమీపంలో సాధారణ ప్రజలు తిరిగే దారుల వెంట మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను పోలీసులు నిర్వీర్యం చేశారు. ఆరు నెలలుగా రెండు రోజులకు ఒక ఘటన జరుగుతుండటంతో ఏజెన్సీ ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. ఇక పోలీసులు, మావోయిస్టులు ఒకరిపై ఒకరు తప్పులు వేస్తూ లేఖలు, పత్రిక ప్రకటనలు విడుదల చేస్తున్నారు. మావోయిస్టుల చర్యలను నిరసిస్తూ సామాన్య ప్రజలు సైతం రహదారులపైకి వచ్చి భారీ ర్యాలీలు చేపడుతున్నారు. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ములుగు జిల్లాలోని అడవుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్నది.


వాజేడు వై జంక్షన్ వద్ద మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ తీస్తున్న ప్రజలు

# కుడా వైస్ చైర్మన్‌గా గ్రేటర్ కమిషనర్ అశ్విని

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

వరంగల్, జూన్ 14 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్‌గా గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు వరంగల్ కలెక్టర్ కుడా వైస్ చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, గ్రేటర్ కమిషనర్ అదనంగా కుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది.






**కాకతీయ యూనివర్సిటీలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. అనర్హులతో ఎగ్జామ్ పేపర్లు వాల్యుయేషన్ చేయించిన విషయం ఇటీవలె వెలుగులోకి వచ్చింది. ఇలాంటివే మరిన్ని జరిగినట్లు జోరుగా చర్చ జరుగుతున్నది. యూనివర్సిటీలో తాజాగా చేపట్టిన నియామకాలూ వివాదాస్పదంగా మారాయి. సీనియర్ ఫ్యాకల్టీలున్నా అర్హత లేని వారిని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆమె వివరణ కోరగా ప్రస్తుత రిజిస్ట్రార్ తప్పుడు సమాచారం ఇచ్చారనే విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌డీ లేకున్నా ఉన్నట్టు చూపించారని, రిజిస్ట్రార్ ప్రతిపాదనలతోనే తాత్కాలిక వీసీ ఆమోదం పొందినట్లు యూనివర్సిటీలో చర్చ జరుగుతున్నది. సీనియర్లను పక్కనబెట్టి వివాదాలున్న వారిని అందలమెక్కించడంపై కరుణ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న అంశం ఆసక్తిగా మారింది.**

**– వరంగల్, జూన్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

# అక్రమాల్లో ఎక్స్‌పర్ట్స్..!

**కేయూలో అర్హత లేకున్నా అందలం**

- వివాదాస్పదమైన బీవోఎస్ ఎక్స్‌పర్ట్స్ నియామకాలు
- పీహెచ్‌డీ లేకున్నా ఉన్నట్టుగా రికార్డులు
- సీనియర్ ఫ్యాకల్టీలకు అన్యాయం జరిగిందని ఆరోపణలు
- రిజిస్ట్రార్ ప్రతిపాదనలతోనే తాత్కాలిక వీసీ ఆమోదం

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి 13 మందిని ఎంపిక చేసి ఇటీవల కిట్స్ కాలేజీలోని పలు విభాగాలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించిన అంశం వివాదాస్పదంగా మారింది. సీఎస్‌ఈ, ఐటీ, నెట్ వర్క్, ఏఐఎంఎల్, ఐవోటీ, డాటా సైన్స్ విభాగాలకు ఒక్కరినే ఎక్స్‌పర్ట్‌గా రిజిస్ట్రార్ ప్రతిపాదిస్తూ ఫైల్ తయారు చేశారని, దీన్నే ఇన్‌చార్జి వీసీ ఆమోదించారని చర్చ జోరుగా సాగుతున్నది. కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈ విభాగంలో నలుగురు ఫ్యాకల్టీలుండగా, వారిని పట్టించుకోకుండా ఒక్కరికే కేటాయించడంలో ఆంతర్యం ఏమిటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరు డిపార్ట్‌మెంట్లకు ఎక్స్‌పర్ట్‌గా నియమితుడైన ప్రొఫెసర్‌కు ప్రమోషన్ ఇచ్చే ప్రక్రియలోనూ తప్పులు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆయనకే మరో అవకాశం ఇవ్వడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన మరో ఫ్యాకల్టీకి పీహెచ్‌డీ లేకున్నా ఈసీఈ డిపార్ట్‌మెంట్ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌గా నామినేట్ చేసినట్లు తెలిసింది. ఇదే డిపార్ట్‌మెంట్‌లో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ ఉన్నప్పటికీ వీరిని పక్కనపెట్టడంలో మతలబు ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

***తొలగించిన వారి నియామకం***

ఈసీఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంపైనా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2013లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితుడైన ఒకరితోపాటు మరో ముగ్గురు బోధనా సిబ్బందిని 2015లో ఉద్యోగంలో నుంచి తొలగించారు. ఈ తొలగింపుపై యూనివర్సిటీ అధికారులు స్టే వెకేట్ పిటిషన్ వేయలేదు. ఈ పని చేయకపోగా తొలగించిన జాబితాలో ఉన్న వారికి అక్రమంగా జీతాలు చెల్లిస్తున్నారని యూనివర్సిటీలోని పలువురు బోధన సిబ్బంది విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సాంకేతికంగా ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తిని ఈసీఈ డిపార్ట్‌మెంట్‌కు ఎక్స్‌పర్ట్‌గా ఎలా నియమిస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత రిజిస్ట్రార్ ఉద్దేశపూర్వకంగానే ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## విజిలెన్స్ విచారణకు ఫైల్స్ రెడీ

బోర్డు ఆఫ్ స్టడీస్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ల నియామకంపై ఇన్‌చార్జి వైస్ చాన్స్లర్‌కు వివరించాను. విజిలెన్స్ విచారణ కోసం అన్ని ఫైళ్లను సిద్ధం చేసి పెట్టాం. పోస్టింగ్ ఆర్డర్‌లో పొరపాటుగా ఒకరి ఇంటిపేరుకు బదులుగా డాక్టర్ అని పడింది. ఆరు డిపార్ట్‌మెంట్లకు ఒక్కరినే సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌గా నియమించడంపైనా వివరించాం. నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

**- పీ మల్లారెడ్డి, రిజిస్ట్రార్, కాకతీయ యూనివర్సిటీ**

## మావోయిస్టుల చర్యలను
# పౌర హక్కుల నేతలు ఖండించాలి

**ములుగు ఎస్పీ పీ శబరీష్**



ములుగు, జూన్14 (నమస్తే తెలంగాణ) : పోలీసులను లక్ష్యంగా చేసుకొని అడవుల్లో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందు పాతర్ల కారణంగా అమాయక ప్రజలు బలవుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పౌర హక్కుల సంఘం నాయకులు వారి చర్యలను ఖండించాలని ములుగు ఎస్పీ పీ శబరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మ రక్షణ కోసం మందు పాతర్లు అమర్చుతున్నామని చెప్పుకునే మావోయిస్టులు తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు పోలీసుల పైకి తప్పును నెడుతున్నారని అన్నారు. పౌర హక్కుల సంఘం నాయకులు ఘటన జరిగిన ప్రదేశాలను సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నిజనిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. తమ ఉనికిని చాటుకునేందుకు సాధారణ ప్రజలు, యాత్రికులు, భక్తులను సైతం టార్గెట్ చేస్తూ కాలి బాటల వెంట మందు పాతరలు అమర్చి వారి ప్రాణాలు బలిగొంటున్నారన్నారు. మావోయిస్టులపై ఏదైనా జరిగినప్పుడు స్పందించే పౌర హక్కుల సంఘం నాయకులు సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే స్పందించకపోవడం బాధాకరమన్నారు. కర్రె గుట్టలను గెర్రిల్లా బేస్ క్యాంపులుగా ఏర్పాటు చేసుకొని సామాన్య ప్రజలను టార్గెట్ చేస్తూ వారిని అడవుల్లోకి రానివ్వకుండా ఉండాలనే ఏకైక లక్ష్యంతో మావోయిస్టులు మందు పాతర్లను అమర్చి భయాందోళనలు కలిగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీ ప్రజలు ఈ విషయాన్ని గమనించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజల ప్రాణాలు రక్షించడమే ధ్యేయంగా అటవీ ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేసి మందు పాతరలను బాంబు స్క్వాడ్ బృందాలతో నిర్వీర్యం చేస్తున్నామన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ధైర్యంగా ఉండాలని, గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

## సునీతకు పరామర్శ.. ఆర్థిక సాయం

వెంకటాపురం (నూగూరు) : కర్రిగుట్టల సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలిన సంఘటనలో గాయపడిన డర్రా సునీత కాలును భద్రాచలం వైద్యులు తొలగించారు. గాయపడిన మహిళ వైద్య ఖర్చుల నిమిత్తం ఓడ బలిజ సేవా సంఘం సభ్యులు, గ్రామస్తులు కలిసి రూ.1.20లక్షలు భర్త మహేశ్‌కు అందజేశారు. చికిత్స పొందుతున్న సునీతను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పరామర్శించా రు. ఆర్థిక సాయం చేసిన వారిలో గ్రామస్తులు డర్రా దామోదర్, తోట నాని, రవి, పోతు రాజు, దివాకర్ తదితరులు ఉన్నారు.

## వైద్య విద్యార్థి ప్రీతి మృతిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణ

***హాజరైన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా***

సుబేదారి, జూన్ 14 : కేఎంసీ వైద్య విద్యార్థి ధరావత్ ప్రీతి మృతిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణ చేపట్టింది. కమిషన్ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను బుధవారం ఢిల్లీకి పిలిపించుకున్నది. ప్రీతి మృతి, తర్వాత పోలీసులు చేపట్టిన విచారణ, చార్జిషీట్ నివేదికను సీపీ కమిషన్‌కు అందజేశారు. పోస్ట్ మార్టం, ఫోరెన్సిక్ రిపోర్ట్, ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాటింగ్, మెడికల్ కళాశాల అధికారులు, ప్రీతి బ్యాచ్‌మెంట్స్‌తో పోలీసులు విచారించిన నివేదికను సీపీ అప్పగించారు.


శాయంపేట – కొత్తగట్టు సింగారం రోడ్డు పక్కన చెట్లను నరికి వదిలేయడంతో రోడ్డుపై పడిన దృశ్యం

# రోడ్డుపై ఇలా.. ప్రయాణం సాగేదెలా?

- చెట్లను నరికి అలాగే వదిలేశారు!
- రెండు కిలోమీటర్లకు పైగా రోడ్డుపైనే చెట్లు
- నరకం చూస్తున్న ప్రయాణికులు

శాయంపేట జూన్ 14 : పచ్చని చెట్లపై గొడ్డలి వేటు పడింది. ఇష్టం వచ్చినట్లు రోడ్డు పక్కన చెట్లను నరికివేసి వదిలేశారు. దీంతో 2 కిలోమీటర్లకు పైగా రోడ్డుపైన చెట్లు పడిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శాయంపేట నుంచి కొత్తగట్టు సింగారం వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన చెట్లను నరికేశారు. అయితే కొన్ని చెట్లను ఏకంగా సగానికి నరికి వేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్లన్నీ గతంలో హరితహారం అవెన్యూ ప్లాంటేషన్లో నాటినవి కావడం గమనార్హం. శాయంపేటతో పాటు పత్తిపాక, ప్రగతి సింగారం, మైలారం, కొప్పుల తదితర చుట్టుపక్కల గ్రామాలు, హనుమకొండకు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. అయితే నాలుగు రోజుల్రితం చెట్లను కొట్టేసి రోడ్డుపైనే వదిలేశారు. ఈ మధ్య గాలి దుమారం రావడంతో రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లడమే కష్టంగా మారింది. ఇక కార్లు, జీపులు వంటి వాహనదారులు తిరిగి వెనక్కి వెళ్లిపోతున్నారు. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, ఇప్పటికైనా రోడ్డుపై వేసిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

## వినియోగదారులకు చేరువయ్యేందుకే..

***టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి***



హనుమకొండ సబర్బన్, జూన్ 14 : వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులను తీసుకుని సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఎన్పీడీసీఎల్ 16 సర్కిళ్ల పరిధిలోని ముఖ్య కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఎన్పీడీసీఎల్ పోర్టల్, కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లకు అనుసంధానిస్తూ విద్యుత్ ప్రజావాణి పేరుపై మరో పోర్టల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

# కుక్కర్ పేలి విద్యార్థులకు గాయాలు

***వరంగల్ అరబిక్ పాఠశాలలో ఘటన***

కాశీబుగ్గ/ఖిలా వరంగల్, జూన్14: గ్రేటర్ వరంగల్ జిల్లా మండి బజార్‌లోని అరబిక్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం కుక్కర్ పేలింది. దీంతో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. జామియా మహ్మద్ ఖైర్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఇందులో సుమారు 88 మంది విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం వంట చేస్తున్న క్రమంలో కుక్కర్ పేలడంతో అబ్దుల్ రెహమాన్ (12), సోను (12), షరీఫ్(12), నౌషద్(11)కు గాయాలయ్యాయి. మొఖం, ఒంటిపై చర్మం కాలిపోవడంతో వారిని స్థానికులు వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.


గాయపడిన విద్యార్థులు


దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

# అందంగా ముస్తాబైన తరగతి గదులు

**నమస్తే ఎఫెక్ట్**

***మొరుమురుకాలనీ పాఠశాలలో పూర్తయిన టైల్స్ పనులు***

వాజేడు ,జూన్ 14 : ములుగు జిల్లా వాజేడు మండలంలో మొరుమురుకాలనీ పాఠశాలలో టైల్స్ పనులు పూర్తయి తరగతి గదులు అందంగా ముస్తాబయ్యాయి. 'సమస్యలు ఇలా.. చదువులు సాగేదెలా' శీర్షికన ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అసంపూర్తిగా ఉన్న టైల్స్ పనులను పూర్తిచేయించారు. దీంతో ఈ గదుల్లోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. కాగా, హ్యాండ్ వాష్, తాగునీటికి సంబంధించిన పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిని కూడా త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.


ఎంపీపీఎస్ మొరుమురు కాలనీ పాఠశాల తరగతి గదిలో టైల్స్ వేయగా విద్యాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

## పెళ్లి కూతురు పేరు మీదే
# కల్యాణలక్ష్మి చెక్కు

- నిబంధనలు గాలికొదిలేసిన అధికారులు
- విషయం వెలుగులోకి రావడంతో రికవరీ చేసేందుకు తంటాలు

ఖానాపురం, జూన్ 14: కల్యాణలక్ష్మి పథకంలో అధికారులు నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఈ పథకంలో 18 ఏళ్లు నిండి పెళ్లి చేసుకున్న ఆడపిల్ల కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు తల్లి పేరుపై రూ.1,01,116 చెక్‌ను ఇచ్చేలా నిబంధనలు రూపొందించారు. కొందరు రెవెన్యూ అధికారులు వాటిని పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ఓ యువతి గతేడాది జూన్‌లో ప్రేమ వివా హం చేసుకుంది. దీంతో కుటుంబసభ్యులు ఆమెతో అంటీముట్టనట్లుగానే ఉంటున్నారు. యువతి తన తల్లిదండ్రులకు తెలియకుండా రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకుని కల్యాణలక్ష్మి చెక్కును తీసుకుని బ్యాంక్‌లో డ్రా చేసుకుంది. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలువగా, తమకు తెలియకుండా చెక్కు ఎలా ఇచ్చారని రెవెన్యూ అధికారులను ప్రశ్నించడంతో దాన్ని రికవరీ చేసే ప్రయత్నంలో ఉన్నారు. అన్నీతానై ఓ అధికారి ఉన్నతాధికారులకు తెలియకుండా ఈ తతంగమంతా నడిపించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఆర్ఐ సత్యనారాయణను వివరణ కోరగా రికార్డ్ అసిస్టెంట్ విచారణ నివేదిక ఆధారంగా రిపోర్ట్ ఇచ్చానని చెప్పుకొచ్చాడు. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.